# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!


- అధికారాన్ని చేపట్టగానే కరెంట్ చార్జీల వాత
- ఉచిత విద్యుత్తుకు మంగళం
- మూడు గంటల కరెంట్‌తో సాగు ఆగమే
- ఆగిపోనున్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పనులు

## 3 గంటల కరెంటుతో ముప్పతిప్పలే

వికారాబాద్, నవంబర్ 27, (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, విద్యుత్తు కోతలే కాదు.. కరెంటు షాకులు కూడా తగులుతాయి. మొన్నటికి మొన్న అధికారంలోకి వచ్చిన కర్ణాటకతోపాటు హస్తంపార్టీ అధికారంలో ఉన్న హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో విద్యుత్తు బిల్లులపై చార్జీల పెంపే దీనికి నిదర్శనం. గృహ, వ్యవసాయ, పరిశ్రమలకు తగినంత విద్యుత్తు సరఫరా చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కర్ణాటకలో కరెంటు కోతలకు తెగబడుతున్నది. సరఫరా చేసే ఆ కొంత కరెంటుపై కూడా కాంగ్రెస్ సర్కారు ఎడాపెడా బిల్లుల మోత మోగిస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగలా మార్చింది. కాంగ్రెస్‌కు అధికారమిస్తే వ్యవసాయం దండుగలా మారే పరిస్థితులు ఏర్పడనున్నాయి. కాంగ్రెసోస్తే 3 గంటల కరెంట్‌తో సాగు పూర్తిగా ఆగంకానున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్తు, సాగునీటికి ప్రాధాన్యతనిస్తూ వస్తున్నది, ఒకవేళ కాంగ్రెస్‌కు అధికారమిస్తే కర్ణాటకలో మాదిరి ఇక్కడ కూడా 3 గంటల కరెంటే దిక్కు కానున్నది. దీంతో గతంలో కాంగ్రెస్ హయాంలోని గడ్డు పరిస్థితులు రానున్నాయి. గత పదేండ్ల కాలంలో జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో సాగు పెరిగి రైతులు ఆర్థికంగా వృద్ధి చెందగా, కాంగ్రెస్ వస్తే సాగు పూర్తిగా ఆగమయ్యే పరిస్థితి ఉంది. గతంలో కరెంట్ ఎప్పుడొస్తదో అంటూ పొలాల వద్ద పడిగాపులు, చీకట్లో కనపడక విద్యుత్తు షాక్‌లతో, పాములు, తేళ్లు కుట్టి రైతులు చనిపోయిన దయనీయ పరిస్థితుల నుంచి వ్యవసాయానికి నిరంతర విద్యుత్తు సరఫరా చేసే స్థాయికి సీఎం కేసీఆర్ తీసుకొచ్చారు. కాంగ్రెస్ ఇస్తామంటున్న మూడు గంటల కరెంట్‌తో జిల్లాకు సాగు నీరందించేందుకు చేపట్టి పూర్తి కావొచ్చిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తిగా ఆగిపోనున్నాయి. అలాగే వ్యవసాయానికి గత పదేండ్లుగా వెన్నుదన్నుగా ఉంటూ నిరంతర విద్యుత్తు, పెట్టుబడి సాయం తదితర చేయూతనందించడంతో జిల్లా నుంచి దుబాయ్, ముంబై, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వలసవెళ్లిన రైతులు తిరిగి సొంతూళ్లకు వచ్చి సాగు చేసుకుంటున్నారు.కాంగ్రెసోస్తే రైతుల బతుకులు ఆగమై మళ్లీ దుబాయ్, ముంబైలకు వలసలు పోవాల్సిన పరిస్థితులు రానున్నాయి.

**మళ్లీ వలసలు.. ఆత్మహత్యలు..**

కాంగ్రెస్ హయాంలో కరెంట్ ఎప్పుడొస్తదా అని రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. మళ్లీ కాంగ్రెస్‌కు అవకాశమిస్తే కరెంట్ కష్టాలు తప్పవు. వ్యవసాయానికి 3 గంటల కరెంట్ ఇస్తే ఓ మూలకు కూడా పారదు. మళ్లీ విద్యుత్తు షాక్‌లతో ఆత్మహత్యలు, అర్ధరాత్రి పొలాల పడిగాపులే తప్పవనే అభిప్రాయం రైతుల నుంచి వ్యక్తం అవుతున్నది. కరెంట్ కష్టాలతో బోర్లు, బావుల్లో నీరున్న సాగు చేసుకోలేని దయనీయ పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది. 3 గంటల కరెంట్‌తో అర్ధ రాత్రి మోటర్లు ఆన్ చేయబోయి విద్యుత్తు షాక్‌తో రైతుల మరణాలు పెరగడంతోపాటు అప్పులు పెరిగి ఆత్మహత్యలతోపాటు వలసపోయే పరిస్థితులు దాపురించనున్నాయి. ప్రస్తుతం రైతులు బోర్లు, బావులకు వినియోగిస్తున్న 5 హెచ్‌పీ మోటర్లకు బదులు 10 హెచ్‌పీ మోటార్లను వినియోగిస్తే రైతులకు అదనపు భారం కానున్నది.



### 3 గంటల కరెంటుతో మళ్లీ కష్టాలే..



కాంగ్రెసోళ్లు వ్యవసాయానికి మూడు గంటలు విద్యుత్తు సరఫరా చేస్తామని చెబుతున్నారు. ఈ కరెంటుతో ఎంత భూమి సాగు చేయాలి. పంటలు ఎలా పండించాలి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు మళ్లీ కష్టాలు వచ్చేనట్లే. అసలు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో వచ్చుడు సమస్యే లేదు. రైతులకు ఎంతో సహకరిస్తున్న బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాం. సీఎం కేసీఆర్ రైతులకు చేస్తున్న మేలు మరువలేం. రైతే రాజ్యంగా భావించిన సీఎం రైతులకు అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నారు. అదునుకు రైతుబంధు సహాయాన్ని అందిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇక వ్యవసాయాన్ని మూసిపెట్టుడే అవుతుంది. వ్యవసాయంపై అవగాహన లేని కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అవసరంలేదు.

**- నర్సింహ, రైతు తింగంపల్లి, కులకచర్ల**

### మూడు గంటల కరెంటు కష్టాలు మాకొద్దు



పాతకాలపు కరెంటు కష్టాలు మళ్లీ మాకొద్దు. గతంలో కాంగ్రెస్ పార్టీ పాలనలో పొలాల దగ్గర కరెంటు కోసం రాత్రినక పగలనక నిద్రలు కాచి వరి పొలంలో మడి తడుపుకునే వాళ్లం. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే అడిగే దిక్కే లేకుండే. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే మూడు గంటల కరెంటుతో మా పొలం ఒక్కమూల కూడా పారదు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు వ్యవసాయానికి 24గంటలు కరెంటు ఇవ్వడంతో పంటలను సాగు చేసుకొని హాయిగా జీవిస్తున్నాం. మేం కాంగ్రెస్‌కు ఓటు వేయం. సీఎం కేసీఆర్ సారునే గెలిపించుకుంటాం. రైతులను ఇబ్బందులకు గురి చేసే కాంగ్రెస్ ప్రభుత్వం మాకొద్దు.

**- శంకర్‌నాయక్, పులిచింతల మడుగు తండా, ధారూరు**

### 3గంటల కరెంటుతో రైతులు ఆగమే..



మూడు గంటల కరెంటుతో రైతులు ఆగమాగమే. రైతులకు 24 గంటల కరెంటుతోనే ప్రయోజనం ఉంది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 3 గంటల కరెంటు, 10 హెచ్‌పీ మోటరుతో వ్యవసాయం చేసుకోవచ్చంటున్నారు. అది ఎప్పటికీ సాధ్యం కాదు. కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంటు సమస్యలు వస్తాయి. 9 ఏండ్ల కాలంలో కరెంటు కష్టాలు రైతులు ఎరగరు. ఇప్పుడు కాంగ్రెస్ మూడు గంటలు చాలంటే రైతులు రాత్రింబవళ్లు పొలాల దగ్గర పడిగాపులు కాయాల్సిందే. 24 గంటల కరెంటుతో ఎప్పుడు పడితే అప్పుడు పంటకు కావాల్సిన నీరు పెట్టుకుంటాం. మూడు గంటల కరెంటుతో రైతులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉంటాయి. మాకు మళ్లీ సీఎం కేసీఆర్ కావాలి. కాంగ్రెస్ ప్రభుత్వం మాకొద్దు.

**- గుట్ట చెన్నయ్య, రైతు, కంచన్‌పల్లి, మహ్మదాబాద్**

### కాంగ్రెస్ వస్తే.. వ్యవసాయం కష్టమే



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మూడు గంటల కరెంట్ ఇస్తామంటున్నారు. ఇలా చేస్తే రైతులు వ్యవసాయం మానేసి కూలి పనులకు పోవాల్సి వస్తుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ 24 గంటల ఉచిత నాణ్యమైన కరెంట్ ఇస్తుండడంతో రెండు పంటలు పండిస్తూ సంతోషంగా ఉన్నాం. మూడు గంటల కరెంట్‌కు వ్యవసాయం చేయడం కష్టమే. కాంగ్రెస్ పార్టీ నాయకులకు రైతులంటే అంత అలుసెందుకో అర్థం కావడం లేదు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలి. బీఆర్ఎస్‌కే మద్దతు ఇద్దాం. మరిన్ని పథకాలను తెచ్చేందుకు సీఎం కేసీఆర్‌కు అవకాశం ఇద్దాం. కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంటు కష్టాలు పడాల్సిందే.

**- మహబూబ్, రెడ్డిఘణపూర్, బషీరాబాద్**

### 10హెచ్‌పీ మోటర్లు.. రైతులకు ఎంతో భారం



10 హెచ్‌పీ మోటరు వాడకం అనేది ఎంతో ఖర్చుతో కూడుకున్నది. దీనికోసం లక్ష రూపాయలకు పైగా ఖర్చవుతుంది. ఈ ఖర్చంతా ఎవరు భరిస్తారు. 10 హెచ్‌పీ మోటరు వాడితే ఇప్పుడున్న ట్రాన్స్‌ఫార్మర్లు కూడా పని చేయవు. కాంగ్రెస్ చెప్పేవన్నీ రైతులకు ఏమాత్రం ఉపయోగం లేని మాటలు. వ్యవసాయం చేసే వారికి మాత్రమే రైతుల కష్టాలు తెలుస్తాయి. కేసీఆర్ పాలనలోనే కరెంటు మంచిగ వస్తున్నది. మూడు గంటల కరెంటు ఎంతమాత్రం ఎవుసానికి సరిపోదు. వ్యవసాయంపై ఏమాత్రం అవగాహన లేని కాంగ్రెస్ నాయకులు ఇచ్చే హామీలను నమ్మి ఓటు వేస్తే మేం కష్టాలు పడాల్సిందే. కాంగ్రెస్ వస్తే రైతులకు కష్టాలే. మాకు కేసీఆర్ సర్కారే కావాలి. కారు గుర్తుకే ఓటు వేస్తాం.

**- సంగమేశ్వర్, మర్పల్లి**

### 3 గంటల కరెంటుతో ఎన్ని మడులు తడపాలి



తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన కరెంట్‌ను సరఫరా చేస్తున్నది. దీంతో పొలాల వద్దకు ఏ సమయంలో వెళ్లి మోటర్ల ద్వారా సాగు నీటిని పార పెట్టుకుంటున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు మళ్లీ షాకులే. వ్యవసాయానికి 3 గంటల కరెంటు ఇస్తే ఎన్ని మడులకు సాగునీరు పార బెట్టుకోవాలి. ఏ సమయంలో పోవాలి. మళ్లీ రాత్రి పూట రైతులు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి కరెంట్ షాక్‌లు, పాముకాటులకు గురికావాల్సిందే. రైతులకు ఇచ్చే కరెంటులో మార్పులు చేసి రైతులను కాంగ్రెస్ మోసం చేయాలని చూస్తున్నది. సీఎం కేసీఆర్ 24 గంటలు కావాలంటే ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌కు మద్దతు తెలపాలి. కాంగ్రెస్ మోసపూరిత మాటలను నమ్మి మోసపోరాదు.

**- బాలవర్ధన్ రెడ్డి, రైతు, తింసాన్‌పల్లి, పెద్దేముల్**

### పంటలు ఎండుడు.. అప్పల బాధలే



గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అరకొరగా కరెంట్ వచ్చేది. మాకు 4 ఎకరాల భూమి ఉంది. వివిధ రకాల పంటలతో పాటు కూరగాయలు సాగు చేసుకుంటున్నాం. కూరగాయలు సరిపడా నీరు పారకపోతే పంటలు ఎండిపోతాయి. పంటలు నష్టపోయి రైతులు అప్పుల ఊబిలో చిక్కుకోవడం ఖాయం. రాత్రి పూట కరెంట్ కోసం పొలాల వద్ద పడిగాపులు కాయాలి. 3హెచ్‌పీ మోటర్లతో పంటల పొలాలకు నీరు సరిపోతుంది. దాంతోనే పంటలు పండిస్తున్నాం. అదనంగా 10హెచ్‌పీ మోటర్లు కొని, పైపులైన్‌లు సైతం కొనుగోలు చేయాలంటే దాదాపు రూ.2లక్షల వరకు ఖర్చు అవుతుంది. 24గంటల కరెంట్ ఇచ్చే ప్రభుత్వానికి మావంతు సహకారం అందిస్తాం. కాంగ్రెస్‌కు అలాంటి అవకాశం ఇవ్వం.

**- పట్లోళ్ల నర్సింహారెడ్డి, ఎన్కతల, మోమిన్‌పేట**

### కాంగ్రెస్ నాయకులు మాటల గారడితో మోసం

కాంగ్రెసోల్లు సన్న, చిన్నకారు రైతులను మభ్య పెట్టి ఎన్నికల పబ్బం గడుపుకోవడానికి 3 గంటల కరెంటు అంటూ రైతులను అయోమయానికి గురి చేస్తున్నది. ఇలాంటివి రైతుల వద్ద సాగవు. కాంగ్రెస్ ప్రయత్నాలను తిప్పి కొడతాం. తెలంగాణలో కరెంటు కష్టాలు లేవు. ఇక రావు. మా కేసీఆర్ సారు ఉండగా. రైతులకు మూడు గంటల కరెంట్ ఇస్తే ఎన్ని ఎకరాలు పారుతుందో కాంగ్రెస్‌కు తెలుసా. 10 హెచ్‌పీ మోటరు బిగించుకోమని కాంగ్రెసోళ్లు చెబుతున్నారు. మోటరు ఎట్లా, పైసలు ఎట్లా. ఇదెక్కడి అన్యాయం. మీ పరిపాలనలో ఉన్న రాష్ట్రాల్లో ఓ న్యాయం.. ఇక్కడి రైతులకు ఇంకో న్యాయమా... కాంగ్రెస్ పరిపాలనలో కరెంటు కష్టాలను చాలా చూశాం. సన్న, చిన్నకారు రైతులకు మూడు గంటల కరెంట్ ఇస్తే సరిపోతుందా? మాకు బీఆర్ఎస్ ప్రభుత్వమే కావాలి.. కాంగ్రెస్ వద్దు. కాంగ్రెస్ నాయకులు అధికారంలోకే రాకముందే రైతులను మోసం చేయాలని చూస్తున్నారు. మాటలతో గారడి చేస్తున్నారు. వారిని నమ్మి ఓటు వేస్తే మనం ఆగం కావాల్సిందే. ఆలోచించి బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటు వేయాలి. మరిన్ని పథకాలను తెచ్చుకుందాం.

**- గొల్ల అనంతయ్య, అంబర్‌పేట (బెన్నూర్), యాలాల**

